
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 14 డిసెంబరు 2024



16న ఎస్సీ కమిషన్ చైర్మన్ జిల్లాలో పర్యటన

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై విచారణ చేయడానికి నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ శుక్లా(రిటైర్డు ఐఏఎస్) ఈ నెల 16న జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 16న ఉదయం 10.00 గంటలకు రోడ్డు మార్గం ద్వారా శ్రీకాకుళం చేరుకుంటారు. 11 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం దళిత కులాలకు చెందిన ఉద్యోగులు/ కుల సంఘ పెద్దలు/ ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

ధర లేదు.. దిగుబడీ లేదు

- ఉద్దానం కొబ్బరికి తగ్గిన డిమాండ్
- కంచిలిలో కనుమరుగైన దుకాణాలు
- వలస పోతున్న కూలీలు



ఉద్దానంలో తితలీ తుఫాన్ సమయంలో నేలకొరిగిన కొబ్బరిచెట్లు

కంచిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):

కొబ్బరి పేరు చెబితే.. ఉభయ గోదావరి జిల్లాల తర్వాత ఠక్కున గుర్తొచ్చేది శ్రీకాకుళం జిల్లా ఉద్దాన ప్రాంతం. ఒకప్పుడు పచ్చని కొబ్బరితోటలతో కళకళలాడే ఉద్దానం.. నేడు కళావిహీనంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి కొబ్బరి పంటను దిగుమతి చేసుకుంటున్న దుస్థితికి చేరింది. ఏటా ప్రకృతి వైపరీత్యాలతోపాటు తెగుళ్ల కారణంగా కొబ్బరి పంట దిగుబడి తగ్గింది. కాయ పరిమాణం కూడా తగ్గడంతో ఉద్దానం కొబ్బరికి గతంలో ఉన్నంత డిమాండ్ లేదని రైతులు వాపోతున్నారు. గిట్టుబాటు ధర లేక.. ప్రభుత్వ ప్రోత్సాహం అందక కొబ్బరి పంటపై ఆధారపడిన వందలాది మంది ఉపాధి కోసం వలస బాట పట్టారని పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి కొబ్బరిసాగుకు చేయూతనివ్వాలని కోరుతున్నారు.



కంచిలి కొబ్బరి కేంద్రంలో నిల్వ ఉంచిన కాయలు

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో సుమారు 35వేల ఎకరాల్లో కొబ్బరి పంట సాగవుతోంది. ఇందులో ఒక్క ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో సుమారు 25 వేల ఎకరాల్లో కొబ్బరి పండిస్తున్నారు. ఉద్దానంలో పండించిన కొబ్బరి ఎక్కువ కాలం నిల్వ ఉండడంతో పాటు పరిమాణం కూడా పెద్దవిగా ఉండేవి. దీంతో డిమాండ్ ఉండేది. ఇక్కడ నుంచి ఒడిశా, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాలకు కొబ్బరిని ఎగుమతి చేసేవారు. గతేడాది రోజుకు సుమారు 320 టన్నులు కొబ్బరికాయలు ఎగుమతి చేశారు. ఈ ఏడాది ఆశించినస్థాయిలో దిగుబడి లేక ప్రస్తుతం 20 టన్నుల కూడా సరుకు ఎగుమతి కావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వరుస తుఫాన్‌లు, తెగుళ్ల కారణంగా ప్రస్తుతం ఉద్దానంలో కొబ్బరి దిగుబడి గణనీయంగా తగ్గింది. 2018లో తితలీ తుఫాన్ సృష్టించిన విధ్వంసంతో ఉద్దానం కకావిలమైంది. వందలాది కొబ్బరిచెట్లు నేలకొరిగాయి. దీనికితోడు ప్రస్తుతం జాతీయ మార్కెట్లో డిమాండ్ తగ్గడంతో ధర మరింత పతనమైంది. కనీసం పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కంచిలి మార్కెట్లో వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.10వేల నుంచి 12 వేలు పలుకుతోంది. ఈ లెక్కన కాయకు పది రూపాయలు మించి రావడం లేదు. గతంలో ఎకరాకు 500 పైగా కొబ్బరికాయలు పండగా.. 200 నుంచి 250 కాయలు మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

కంచిలిలో కానరాని సందడి..

ఉద్దానంలో కొబ్బరి పంట.. అధికంగా కంచిలిలోని వ్యాపార కేంద్రాల ద్వారానే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేది. నిత్యం కంచిలిలో లారీల రాకపోకలు, కూలీల హడావిడితో సందడిగా ఉండేది. గతంలో ఒక్క కంచిలి ప్రాంతంలోనే సుమారుగా 40 కొబ్బరి దుకాణాలు ఉండేవి. అందులో దాదాపు 1200 మంది కూలీలు పని చేస్తుండేవారు. కానీ ప్రస్తుతం (మిగతా 6వ పేజీలో..)

నేడే సాగునీటి సంఘాల ఎన్నికలు

- పూర్తయిన ఏర్పాట్లు..
- బరిలో కూటమి మద్దతుదారులే
- వైసీపీ శ్రేణులు దూరం

శ్రీకాకుళం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు జిల్లాలో సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. వాస్తవానికి ఈ ఎన్నికలు ఈనెల 5న జరగాల్సి ఉంది. కానీ తుఫాన్ ప్రభావం వల్ల ప్రభుత్వం ఈ నెల 14కు వాయిదా వేసింది. అయితే ఈ ఎన్నికల్లో ఎటువంటి పోటీ లేకుండా.. కూటమి మద్దతుదారులే బరిలో ఉండే అవకాశం ఉంది. నిబంధనలు ప్రకారం రాజకీయాలకు అతీతంగా ఈ ఎన్నికలు జరగాల్సి ఉంది. జిల్లాలో మేజర్ వాటర్ యూజర్ అసోసియేషన్‌లు 94, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 21, మైనర్ వాటర్ యూజర్ అసోసియేషన్‌లు 250, అలాగే వంశధార, నారాయణపురం వాటర్ యూజర్స్ కమిటీలు ఉన్నాయి. మొత్తం 344 ఆయకట్టు సంఘాలకు సంబంధించి ఈసారి 4,57,900 మంది ఓటర్లుగా గుర్తించారు. వీరిలో పురుషులు 3,42,594 మంది, మహిళలు 1,15,306 మంది ఉన్నారు. శనివారం ఉదయం ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం అధ్యక్ష, ఉపాధ్యక్షులను సభ్యులు ఎన్నుకుంటారు. ఎన్నిక అంతా చేతులెత్తి మద్దతు తెలిపే విధానమే. ఎక్కడైనా అభ్యంతరం ఉంటే సాగునీటి రైతులు రహస్యంగా ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పిస్తారు. ఈనెల 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, ఈనెల 20న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నిక జరుగుతుంది. దీంతో ఎన్నికల ప్రక్రియ పూర్తి అవుతుంది. ఈ ఎన్నికలు అంతటా లాంఛనప్రాయమే. కీలకంగా ఉన్నవి మాత్రమే అటు నారాయణపురం ప్రాజెక్టు, ఇటు వంశ ధార ప్రాజెక్టులకు చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులపై అందరి దృష్టి ఉంది. అయితే ఇప్పటికే వైసీపీ ఈ ఎన్నికలను బాయికట్ చేస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవంగా క్షేత్రస్థాయిలో వైసీపీకి ఆద రించే పరిస్థితి ఇప్పట్లో లేదు. దీంతో ఉద్దేశపూర్వకంగా పోటీ నుంచి తప్పుకుంటూ కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ.. ఎన్నికలను బాయికట్ చేస్తున్నట్లు శుక్రవారం సాయంత్రం వైసీపీ అధిష్ఠానం ప్రకటన జారీచేసింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అనుకూల వర్గం అంతా ఈసారి సాగునీటి సంఘాల ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించనుంది. వైసీపీ దూరం కావడంతో.. పెద్దగా పోటీలేకుండా ఎన్నికలు ముగిసే అవకాశముంది. ఇదిలా ఉండగా.. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయాల్లో సిబ్బందికి ఎన్నికల సామగ్రి అందజేశారు. తహసీల్దార్ కార్యాలయాల్లో ఎన్నికల విధులు, తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులు సూచనలు చేశారు.



నందిగాం : ఎన్నికల సామగ్రి కోసం నిరీక్షిస్తున్న సిబ్బంది

రూ.5లక్షలు ఇస్తే.. రూ.25 లక్షల నకిలీ నోట్లు

- దొంగనోట్ల ముఠా ఒప్పందం
- పోలీసుల తనిఖీలో.. 'నకిలీ' గుట్టురట్టు
- వైసీపీ ఎంపీటీసీ సహా ఆరుగురు అరెస్టు
- రూ.57.25 లక్షల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు, సామగ్రి



మెళియాపుట్టి : మాట్లాడుతున్న డీఎస్పీ మూర్తి

మెళియాపుట్టి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వారంతా తక్కువ కాలంలో అధికంగా డబ్బులు సంపాదించాలని ఆశపడ్డారు. ఈ విషయంపై సామాజిక మాధ్యమాల్లో వెతికారు. దొంగనోట్లు ఎలా తయారుచేయాలో నేర్చుకున్నారు. ముఠాగా ఏర్పడి దొంగనోట్లు చెలామణీ చేశారు. వారి ఆగడాలను పోలీసులు గుర్తించి.. దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం మెళియాపుట్టి పోలీసుస్టేషన్‌లో టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ మూర్తి వెల్లడించారు.

'మెళియాపుట్టి మండలంలో దొంగనోట్లు చెలామణీ చేస్తున్న సమాచారం అందింది. రూ.5లక్షలు ఇస్తే.. రూ.25లక్షలు దొంగనోట్లు ఇస్తామని ముఠా ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఎస్ఐ రమేష్‌బాబు.. సిబ్బందితో గురువారం పట్టుపురం వద్ద మాటు కాశారు. ఆ సమయంలో మెళియాపుట్టి మండలం సంతలక్ష్మీపురానికి చెందిన తమ్మిరెడ్డి రవి అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. ఆయన వద్ద పోలీసులు తనిఖీ చేయగా రూ.50వేల నకిలీ నోట్లు లభ్యమయ్యాయి. దీనిపై విచారణ చేపట్టగా కొంతమంది ముఠా సభ్యులు దొరికారు. తమ్మిరెడ్డి రవికి దొంగనోట్ల తయారీపై అనుభవం ఉంది. ఒడిశాలో నోట్లు తయారుచేసే పేపర్లు తీసుకువచ్చి.. దొంగనోట్లు ముద్రించేందుకు ప్రయత్నించాడు. ఇందులో భాగంగా పలాస మండలం పెదంచల గ్రామానికి చెందిన కె.దుర్వాసులు, సంతలక్ష్మీపురానికి చెందిన తమ్మిరెడ్డి ఢిల్లీరావు, దాసరి కూమార్ స్వామి, మెళియాపుట్టి మండలం కరజాడ వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు దాసరి రవి, వజ్రపుకొత్తూరు మండల డోకులపాడు గ్రామానికి చెందిన దుమ్ము ధర్మారావు ముఠాగా ఏర్పడి దొంగనోట్లు ముద్రించారు. ఆ ఆరుగురిని అరెస్టు చేశాం. వారి వద్ద రూ.57.25 లక్షల దొంగనోట్లు లభ్యమయ్యాయి. వాటితోపాటు దొంగనోట్ల తయారీకి వినియోగించిన కలర్ జిరాక్స్ మిషన్, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నాం. తమ్మిరెడ్డి రవి, కె.దుర్వాసులపై గతంలో పలాసలో వివిధ కేసులు నమోదయ్యాయి. ధర్మారావుపై కూడా మందస, కాశీబుగ్గ పోలీసుస్టేషన్లలో దొంగతనం కేసులు నమోదయ్యాయి. వీరు రూ.200, రూ.500 నకిలీ నోట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించాం. మరికొంత మంది పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామ'ని డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ మూర్తి తెలిపారు. ఈ కేసును ఛేదించిన పాతపట్నం సీఐ రామారావు, ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది వైకుంఠరావు, సూర్యం, జగన్ తదితరులను ఎస్పీ కేవీ మహేంద్రరెడ్డి ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు.

పెనసాం వద్ద మరో ఇద్దరు..

- రూ.15 లక్షల నకిలీ నోట్లు లభ్యం

జి.సిగడాం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రణస్థలం నుంచి రాజాం వైపు వెళ్తుండగా.. జి.సిగడాం మండలం పెనసాం గ్రామం వద్ద నకిలీ నోట్లతో ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. పెనసాం వద్ద ఎస్ఐ వై.మధుసూదనరావు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఎచ్చెర్ల మండలం కొత్త దిబ్బలపాలెం గ్రామానికి చెందిన గనగళ్ల రవి, లావేరుకి చెందిన ఎన్ని రాజేష్ వద్ద రూ.15 లక్షల విలువ గల రూ.500 నకిలీ నోట్లు లభ్యమయ్యాయి. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని.. నగదుతోపాటు ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరినీ జేఆర్ పురం సీఐ అవతారం ఆధ్వర్యంలో.. పొందూరు కోర్టులో హాజరుపరచగా.. రిమాండ్ నిమిత్తం జిల్లా కారాగారానికి తరలించామని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.



జి.సిగడాం : నకిలీనోట్లతో పోలీసులకు పట్టుబడిన నిందితులు



ఎరువులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

గుజరాతీపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లావేరు మండలం పాతకుంకాం గ్రామం, విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం కర్లాంలోని ఎరువుల దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. దుకాణాల్లోని సరుకు వ్యత్యాసాలు, కాలం చెల్లిన పురుగు మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రూ.9,59,089 విలువైన 70.54 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసి, సంబంధిత దుకాణదారులపై 6(ఏ) కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్పీ బి.ప్రసాదరావు మాట్లాడుతూ ఎరువుల అక్రమ వ్యాపారంపై నిఘా ఉంచామని, తనిఖీల్లో పట్టుబడిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విజిలెన్స్ డీజీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, ప్రాంతీయ నిఘా అధికారి బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఇంతకీ వారెక్కడ?

- నిరసన కార్యక్రమానికి ధర్మాన, సీతారాం, ఎమ్మెల్సీ దువ్వాడ గైర్హాజరు

శ్రీకాకుళం అర్బన్/అరసవల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా.. వైసీపీ అధిష్ఠానం పిలుపునిచ్చిన ఉద్యమ పోరాటానికి జిల్లాలో ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలు ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ గైర్హాజరయ్యారు. కూటమి పాలనలో రైతులకు అన్యాయం జరుగుతోందని.. వారికి మద్దతుగా నిలిచేలా వైసీపీ అధిష్ఠానం ఎడ్లబండిపై కలెక్టరేట్ వరకూ నిరసన కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. కాగా శుక్రవారం శ్రీకాకుళంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ధర్మాన, సీతారాం, దువ్వాడ కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం వైసీపీ కార్యక్రమాలకు మాజీమంత్రి ధర్మాన దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి కూడా ఆయన హాజరుకాలేదు. మరోవైపు ఆమదాలవలస నియోజకవర్గ బాధ్యతలు తన కుమారుడు నాగ్‌కు కాకుండా.. చింతాడ రవికి అప్పగించడంతో.. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కూడా పార్టీ కార్యక్రమాలకు దూరమవుతున్నారని.. పార్టీ శ్రేణులే గుసగుసలాడుకుంటున్నారు. మరోపక్క టెక్కలిలో పేరాడ తిలక్ ప్రారంభించిన పార్టీ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనుకి ఆహ్వానం లేకపోవడంతో ఆయన కూడా అలకపాన్పు ఎక్కి.. రైతు ఉద్యమానికి మంగళం పలికారని పార్టీ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఒకే ఊరు.. రెండు రాష్ట్రాలు



రట్టిణిలో నిర్మించిన ఆలయాలు

- పాతపట్నం నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి
- ఆంధ్రా-ఒడిశా పరిధిలో రట్టిణి, కౌసల్యపురం గ్రామాలు
- రాష్ట్రాలు వేరైనా ఐక్యమత్యంతో జీవనం

6లో

రియల్.. ఢమాల్!



నరసన్నపేట శివారులో రియల్ ఎస్టేట్ వెంచర్

- స్తంభించిన లావాదేవీలు
- మందగించిన కొనుగోళ్లు
- అప్పుల ఊబిలో వ్యాపారులు
- పడిపోయిన రిజిస్ట్రేషన్లు

● నరసన్నపేటకు చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి.. నరసన్నపేట, రణస్థలం, ఇచ్ఛాపురం, కోటబొమ్మాళి ప్రాంతాల్లో రెండేళ్ల క్రితం రూ.కోట్ల పెట్టుబడితో వెంచర్లు వేశారు. అక్కడ వ్యాపారాలు సాగక.. తెచ్చిన అప్పులు కట్టలేక.. నరసన్నపేట పట్టణంలో తనకు వారసత్వంగా లభించిన భూమిని అమ్మేసి అప్పులు తీరుస్తున్నారు.

● శ్రీకాకుళంకు చెందిన ఒక రియల్టర్.. కోట్లది రూపాయిలు పెట్టుబడి పెట్టి ఎచ్చెర్ల, రణస్థలం, నరసన్నపేట మండలాల్లో వ్యాపారం ప్రారంభించారు. రెండేళ్లగా వేసిన ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో.. ఒక ప్రైవేటు ఏజెన్సీకి అమ్మకాల బాధ్యత అప్పగించారు. వారు కూడా విక్రయించ లేకపోవడంతో అప్పుల భారం పెరిగి.. రియల్టర్ తన స్వగ్రామంలో వ్యవసాయ భూములను అమ్మి తెచ్చిన అప్పులకు వడ్డీ చెల్లిస్తున్నారు.

నరసన్నపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి):

ఒకప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడుపువ్వులు.. ఆరుకాయులుగా సాగింది. ఇందులో రూ.కోట్లు గడించిన వారు జిల్లాలో ఎంతోమంది ఉన్నారు. తక్కువ సమయంలోనే డబ్బు కూడబెట్టారు. అయితే ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. అప్పులు తెచ్చి మరీ ఈ వ్యాపారం సాగించిన వ్యాపారులు, మధ్యవర్తులు తలలు పట్టుకుంటున్నారు. కరోనా సమయం నుంచి రియల్ వ్యాపారంపై తీవ్ర ప్రభావం పడింది. క్రయవిక్రయాలు జరగక రిజిస్ట్రేషన్లు తగ్గిపోవడంతో ప్రభుత్వ ఆదాయం సైతం పడిపోయింది. శ్రీకాకుళం, రణస్థలం, ఎచ్చెర్ల, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో ఆరంభమైన రియల్ పతనం ఐదు నెలలు వ్యవధిలోనే అంతటా విస్తరించింది. ఇప్పుడు పట్టణాల్లో కూడా ధరలు రెండింతలు తగ్గిపోయాయి. నరసన్నపేట పట్టణం మారుతీనగర్‌లో చదరపు అడుగు స్థలం రూ.2లక్షలకు పైగా ఉండగా.. ఇప్పుడు రూ.లక్షకు దిగింది. అలాగే ముఖ్య పట్టణాల్లో లెక్కకు మించి భవనాలు, విల్లాలు, వ్యక్తిగత గృహాలు నిర్మించినా సగానికి సగం కొనుగోలుకు దూరంగా ఉన్నాయి.

పెరిగిన ధరలతో.. కుదేలైన రియల్ వ్యాపారం..

జిల్లా కేంద్రంతో పాటు నియోజవర్గ ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశన్నంటడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి ఎదురవుతోంది. శ్రీకాకుళం పట్టణం 80 అడుగుల రోడ్డులో ఎకరా రూ.10 కోట్ల పైగా పలుకుతుండగా నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేట, పాతపట్నం, ఆమదాలవలస, కోటబొమ్మాళి తదతర పట్టణాల్లో ఎకరా రూ.4 కోట్ల వరకు ఉంది. గ్రామాల్లో సెంటు భూమి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతోంది. ఇంటి నిర్మాణానికి 1500 చదరపు అడుగుల స్థలం కొనుగోలు చేయాలంటే రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు పెట్టాల్సిన పరిస్థితి. జిల్లా కేంద్రంలో కొనుగోలు చేయాలంటే రూ.కోటి వరకు వెచ్చించాల్సిందే. దీంతో సామాన్యులు కొనే పరిస్థితి లేదు.

లబోదిబోమంటున్న వ్యాపారులు..

ఐదేళ్ల కిందట రియల్ ఎస్టేట్ జోరుగా సాగడంతో వ్యాపారులు రూ.కోట్లు గడించారు. దీంతో చాలామంది ఈ వ్యాపారంలో దిగారు. ఫైనాన్స్ నుంచి డబ్బులు తెచ్చి పెట్టుబడులు పెట్టారు. అయితే (మిగతా 6వ పేజీలో..)

ఒకే ఊరు.. రెండు రాష్ట్రాలు

- పాతపట్నం నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి
- ఆంధ్రా-ఒడిశా పరిధిలో రట్టిణి, కౌసల్యపురం గ్రామాలు
- రాష్ట్రాలు వేరైనా ఐక్యమత్యంతో జీవనం



మెళియాపుట్టి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి):

జిల్లా సరిహద్దున ఉన్న ఆ రెండు గ్రామాలు ఆంధ్రా-ఒడిశా పరిధిలో ఉన్నాయి. ఐదు దశాబ్దాలకుపైగా ఒకే ఊరు.. రెండు రాష్ట్రాలుగా కొనసాగుతున్నాయి. రాష్ట్రాలు వేరైనా ఆయా గ్రామస్థులంతా ఒకేమాట.. ఒకేబాటగా కలిసి సాగిస్తున్నారు. ఇరు రాష్ట్రాల సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. ఇదీ పాతపట్నం నియోజకవర్గంలోని మెళియాపుట్టి మండలం రట్టిణి, కొత్తూరు మండలంలోని కౌసల్యపురం గ్రామాల ప్రత్యేకత.

● సిక్కోలు.. రాష్ట్రానికి చివరగా ఉన్న జిల్లా. ఈ జిల్లాలో చివరిగా.. పాతపట్నం నియోజకవర్గం మెళియాపుట్టి మండలం రట్టిణి గ్రామం ఉంది. ఈ గ్రామంలో ఇంటి గుమ్మం ఆంధ్రా అయితే.. పెరడు ఒడిశా రాష్ట్రంలో ఉంది. ఇరు రాష్ట్రాల సరిహద్దుగా ఒక బావి ఏర్పాటు చేసుకున్నారు. రాష్ట్రాలు వేరైనా వారంతా సుమారు 50 ఏళ్ల నుంచి ఐక్యమత్యం కలిసిమెలసి జీవనం సాగిస్తున్నారు. రట్టిణిలో సుమారు 336 కుటుంబాలు ఉండగా.. దాదాపు వెయ్యి మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామానికి ఎడమ వైపు ఆంధ్రా పాఠశాల, కుడివైపు ఒడిశా పాఠశాల ఉన్నాయి. విద్యార్థులు నచ్చిన భాషలో చదువుకునేందుకు అవకాశం కల్పించడంతో ఆంధ్రా పాఠశాలలో ఒడియా ఉపాధ్యాయులను నియమించారు. పేరుకు ఆంధ్రా పాఠశాల అయినా అక్కడ ఒడియా భాషలోనే విద్యాబోధన చేపడుతున్నారు. ఒడిశా పాఠశాలల్లో మాత్రం తెలుగు బోధన జరగదు. దీంతో గ్రామంలో చాలా మంది ఒడియా భాషలోనే మాట్లాడుతుంటారు. గ్రామంలో రెండు ఆలయాలు నిర్మించుకున్నారు. ఆ ఆలయాలకు ఇరు రాష్ట్రాల ప్రజలు కలిసిమెలసి వెళ్తారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్నా.. అంతా కలిసికట్టుగా పరిష్కరించుకుంటారు.


కౌసల్యపురం గ్రామానికి సరిహద్దు..

● ఒడిశా సాగునీరే ఆధారం..

రట్టిణిలో రైతులు ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ల ద్వారా సాగు చేస్తున్నారు. ఒడిశాలోని అమర్ గ్రామం నుంచి.. సాగునీరు అందుతోంది. రట్టిణి గ్రామం నుంచి తాగునీటిని ఒడిశా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. అలాగే ఒడిశా రాష్ట్ర వైద్యసేవలుపైనే ప్రజల ఆధారపడుతున్నారు. గతంలో ఇరు రాష్ట్రాలకు సంబంధించి పథకాలు అందుకునేవారు. ఆధార్ వచ్చిన తర్వాత ఏదో ఒక రాష్ట్రం పథకాలు మాత్రం పొందుతున్నారు. ఒడిశాలో కన్నా ఆంధ్రాలో సంక్షేమ పథకాలు బాగుండడంతో చాలామంది ఇక్కడ స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రామం మహేంద్రతనయ నదికి చెంతనే ఉండడంతో వర్షాలు, తుఫాన్‌ల సమయంలో గ్రామానికి ముంపు ముప్పు వాటిల్లుతోంది. రక్షణ గోడకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


రట్టిణిలో ఈ బావే సరిహద్దు

● చిట్టచివరగా కౌసల్యపురం..

కొత్తూరు మండలం కౌసల్యపురం కూడా చిట్టచివరి గ్రామమే. ఈ గ్రామం ఒడిశా రాష్ట్రం అడ్డుబంగి గ్రామానికి ఆనుకుని ఉంది. ఈ గ్రామంలో కొంత భాగం ఆంధ్రా.. మరి కొంత భాగం ఒడిశా పరిధిలో కొనసాగుతోంది. ఇరు రాష్ట్రాల పండుగలను గ్రామస్థులు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కౌసల్యపురంలో 250 ఇళ్లు ఉండగా.. 820 మంది జనాభా ఉంది. గతంలో పాఠశాల కోసం ఇరురాష్ట్రాల ప్రజలు ఆందోళన చేశారు. పాఠశాలలో ఒక గది.. ఒడిశా భూభాగంలో ఉంటుందని, అక్కడి ప్రభుత్వం నోటీసులు ఇవ్వడంతో ఆందోళన చేశారు. కాగా.. గత 15 ఏళ్లుగా ఎటువంటి సమస్యలు లేకుండా ఇరు రాష్ట్రాల పరిధిలో గ్రామస్థులంతా కలిసిమెలసి జీవిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇరు రాష్ట్రాలకు వేర్వేరుగా ఎన్నికలు వస్తే.. ఈ రెండు గ్రామాలు మరింత సందడిగా కనిపిస్తాయి. సాధారణ ఎన్నికలు ఒకేసారి జరుగుతున్నా.. స్థానిక సంస్థల ఎన్నికలు మాత్రం ఇరు రాష్ట్రాలకు వేర్వేరు నిర్వహిస్తుంటారు. అటువంటి సమయంలో ఇరు రాష్ట్రాల ప్రజలు కలిసి ప్రచారంలో పాల్గొంటారు. ఎన్నికల అనంతరం పార్టీలకు అతీతంగా అంతా ఐక్యమత్యంతో కలిసి.. ఆదర్శంగా నిలుస్తున్నారు.


కౌసల్యపురం




రట్టిణిలో ఒడిశా, ఆంధ్ర పాఠశాలలు

సాగునీరే ఆధారం..



మాకు ఒడిశా ప్రభుత్వం సాగునీరు ఇవ్వకపోతే పంటలు పండించుకోలేం. గత 50ఏళ్ల నుంచి గ్రామంలో అందరం కలిసిమెలసి ఉంటున్నాం. పండుగలన్నీ ఐక్యమత్యంతో చేసుకుంటున్నాం.

-రమేష్ పాత్రో, రట్టిణి గ్రామం

బేధం లేదు..



మేము ఆంధ్రా-ఒడిశాలో ఉన్నామనే బేధం ఎవరికీ లేదు. ఎప్పుడు తగదాలు జరగవు. కుటుంబ తగదాలు జరిగితే పోలీసుస్టేషన్‌కు వెళ్తారు. కానీ, అంతర్రాష్ట్ర తగాదాలు ఎప్పుడూ జరగలేదు.

-విజ్జారాజ్ మహాపాత్రో, రట్టిణి

ఆంధ్రాలో పథకాలు బాగుంటాయి..



పూర్వం మా తాతలు.. ఒడిశా నుంచి ఆంధ్రాకు వలసలు వచ్చారు. ఆంధ్రాలో పథకాలు బాగుంటాయి. అందుకే ఒడిశా నుంచి ఆంధ్రాకు వలసలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

-రుక్మిణి, రట్టిణి

స్వదేశానికి సిక్కోలు మత్స్యకారులు

- రెండు, మూడు రోజుల్లో స్వగ్రామాలకు చేరిక
- ఆరునెలల క్రితం చెన్నైకి ఇద్దరు వలస
- వేటకు వెళ్లి శ్రీలంక జలసరిహద్దులో అరెస్టు
- విదేశాంగ మంత్రితో రామ్మోహన్‌నాయుడు చర్చలు
- విడుదలకు అంగీకరించిన శ్రీలంక ప్రభుత్వం


విదేశాంగ మంత్రితో చర్చిస్తున్న కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక సముద్ర జలాల్లోకి అనుకోకుండా ప్రవేశించి ఆరు నెలలుగా ఆ దేశం జైల్లో మగ్గుతున్న జిల్లా మత్స్యకారులు స్వదేశానికి చేరుకోనున్నారు. ఈ మేరకు శ్రీలంకలోని భారత ఎంబసీ నుంచి కేంద్ర పౌర విమానాయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కార్యాలయానికి శుక్రవారం సమాచారం అందించారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్ద గనగళ్లవానిపేటకు చెందిన దాసరి వెంకయ్య(35), గనగళ్ల కొర్లయ్య(33) ఉపాధి నిమిత్తం జూన్ 7న చెన్నైకి వలస వెళ్లారు. అక్కడ 25న 8మందితో కలిసి బోటులో సముద్రంలో వేటకు వెళ్లారు. అయితే సరిహద్దులు తెలియక శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించడంతో ఆ దేశ కోస్టుగార్డు పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో పాటు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన రామ్మోహన్‌నాయుడు బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పిస్తూ విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్‌ను కలిశారు. మత్స్యకారులను శ్రీలంక చెర నుంచి విడిపించాలని కోరారు. అలాగే అక్కడి భారత ఎంబసీకి సమాచారం అందించారు. సంప్రదింపులు కొలిక్కిరావడంతో ఇద్దరు మత్స్యకారులను విడుదల చేసేందుకు శ్రీలంక ప్రభుత్వం అంగీకరించింది. కోర్టులో న్యాయ ప్రక్రియ పూర్తికాగానే వారిని ముందుగా కొలంబో.. అక్కడి నుంచి విమానంలో స్వదేశానికి చేర్చేందుకు అంగీకరించారు. రెండు, మూడు రోజుల్లో వారు భారత్‌కు రానున్నారు. దీంతో మత్స్యకార కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారులను విడిపించేందుకు చొరవ చూపిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విదేశాంగ మంత్రి జైశంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


దాసరి వెంకయ్య మత్స్యకారుడు


గనగళ్ల కొర్లయ్య

ధర లేదు.. దిగుబడీ లేదు


కంచిలిలో పాతసామాను కొనుగోలు కేంద్రాలుగా మారిన కొబ్బరి దుకాణాలు

(ఐదో పేజీ తరువాయి)

ఆరు దుకాణాలు మాత్రమే ఉన్నాయి. మిగిలినవన్నీ పాత సామాన్లు విక్రయించే షాపులుగా, గోడౌన్‌లుగా మారిపోయాయి. గతంలో కొబ్బరి దుకాణాల వల్ల లారీల రాకపోకలు జరిగి.. ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది కుటుంబాలకు ఉపాధి లభించేది. నేడు కంచిలి కొబ్బరి మార్కెట్ ఉనికిని సైతం కోల్పోయింది. పక్క రాష్ట్రాల నుంచి కొబ్బరి కాయలు దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి కొబ్బరి సాగుకు తోడ్పాటు అందించాలని, మద్దతు ధర ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి..



ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి పంట అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కొబ్బరి కార్మికుల కుటుంబాలకు సైతం ఉపాధి కల్పించేలా అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తాం. కొబ్బరికి మద్దతు ధర అందించాం. ఉపాధిహామీ పథకం ద్వారా కొబ్బరి పంట అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం.

-బెందాళం అశోక్, ప్రభుత్వ విప్

ముందుకు సాగని 'ఆఫ్‌షోర్'

- వైసీపీ హయాంలో మమ అనిపించిన వైనం
- కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు


ఆఫ్‌షోర్ పనులపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ (ఫైల్)

టెక్కలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా ఆఫ్‌షోర్ అడుగు ముందుకు పడలేదు. 2019-24 వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏడుశాతం పనులు మాత్రమే జరిపి మమ అనిపించారు. జిల్లాకు చెందిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆఫ్‌షోర్ పనులపై మరోసారి దృష్టిసారిస్తే తప్ప అడుగు ముందుకు పడదని రైతులు భావిస్తున్నారు. ఆఫ్‌షోర్ నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభిస్తుందా అని రైతులు నిరీక్షిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు ఎర్త్‌బండ్, డైవెర్షన్ రోడ్డు, ఆర్ఎంసీ కాలువ వంటి పనులకు రూ.20కోట్ల వరకు ఖర్చు చేశారు. వాటికి సంబంధించి ఇప్పటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆఫ్‌షోర్‌కు ప్రాథమికంగా రూ.30కోట్లు కేటాయించింది. అయితే ఈ నిధులతో రేగుపాడు మొదలుకొని చీపురుపల్లి మీదుగా డైవర్షన్ రోడ్డు పనులు, బడగాం వైపు ఎర్త్‌బండ్ పనులు, అర్చునాపురం సమీపంలో టర్నల్ పనులు జరిపించాల్సి ఉన్నా అధికారులు ఊసెత్తడం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వ హయాంలో 25శాతం లోపల పనులు జరిగిన వాటికి ఎందుకు రద్దు చేయకూడదని కోరడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఖర్చుపెట్టిన రూ.20కోట్ల బిల్లులు చెల్లించక, కూటమి ప్రభుత్వంలో రూ.35కోట్లు కేటాయించినా ఆ నిధులు ఖర్చు పెట్టకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మెళియాపుట్టి, నందిగాం, వజ్రపుకొత్తూరు, పలాస మండలాలకు సంబంధించి 24,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు గాను 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రేగులపాడు వద్ద రూ.127కోట్లతో శంకుస్థాపన చేసిన ఆఫ్‌షోర్ 2024 చివరి అంకానికి వచ్చినా 50శాతం పనులు కూడా పూర్తికాలేదంటే పరిస్థితి అర్థమవుతుంది. ఏడాదికి ఏడాదికి ఆఫ్‌షోర్ వ్యయం మరింత పెరిగిపోతోంది. ఆఫ్‌షోర్ పూర్తికావాలంటే రూ.900 కోట్లు అవసరమని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. పనుల జాప్యానికి సంబంధించి వంశధార ఈఈ బి.శేఖరరావు వద్ద ప్రస్తావించగా జనవరి నుంచి ఆఫ్‌షోర్ పనులు ప్రారంభం జరుగుతాయని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ వ్రతాలు

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆంజనేయస్వామి ఆలయాల్లో శుక్రవారం హనుమాన్ వ్రతాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న పంచముఖి ఆంజనేయ స్వామి కోవెలలో, హను మాన్ వ్రతం నిర్వహించారు. భక్తులు హాజరై హనుమద్ వ్రతాన్ని చేశారు. ఆలయ ధర్మకర్త లోకనాథం నందికేశ్వరరావు, డాక్టర్ గుంపా శివ ప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అలాగే ఉమారుద్రకోటేశ్వరాలయంలో ఉన్న హనుమాన్ దేవాలయంలో ఆరవెల్లి సీతారామమూర్తి ఆధ్వ ర్యంలో, ఏడురోడ్ల జంక్షన్ వద్ద ఉన్న అంజ నేయస్వామి ఆలయంలో హనుమాన్ వ్రతాలు నిర్వహించారు. మహాలక్ష్మినగర్ కాలనీలో ఉన్న ప్రసన్నాంజనేయ ఆలయంలో హనుమాన్ వ్రతాలు చేశారు. తమలపాకులు, నిమ్మకాయ దండలతో పూజలు నిర్వహించారు.


కలెక్టర్ బంగ్లా వద్ద పంచ ముఖేశ్వర ఆంజనేయ స్వామి పూజలు..

ఇచ్ఛాపురం పట్టణంలో..

ఇచ్ఛాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మెయిన్‌రోడ్ సమీపంలోని కోదండరామ స్వామి ఆలయంలో సామూహిక హనుమత్ వ్రతాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఆలయ ధర్మకర్త ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పద్మకుమార్ ఆచార్యులు వ్రతాలను జరిపారు. అనంతరం హనుమాన్ కథను అర్చకులు చదివి వినిపించారు.


ప్రసన్నాంజనేయ స్వామికి పూజలు..


సామూహిక హనుమత్ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

రియల్.. ధమాల్!

(ఐదో పేజీ తరువాయి)

గత ఐదు నెలల నుంచి రియల్ వ్యాపారం పడిపోయింది. అప్పులకు డబ్బులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన వారు కుదేలై పోయారు. పైకి చెప్పుకోలేక హరాందాతనాన్ని కొనసాగిస్తున్న వ్యాపారులు ఎందరో ఉన్నారు.

తగ్గిన రిజస్ట్రేషన్లు..

రియల్ వ్యాపారం కుదేలవడంతో రిజస్ట్రేషన్లు తగ్గి ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం చూపుతోంది. నరసన్నపేట, కోటబొమ్మాళి, శ్రీకాకుళం, టెక్కలి కార్యాలయాల్లో గతంలో రోజుకు 50 నుంచి 100 డాక్యుమెంట్లు రిజస్ట్రేషన్లు అయ్యేవి. ఫీజుల ద్వారా నెలకు రూ.కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది. అయితే కరోనా కారణంగా తగ్గుతూ వచ్చిన రిజస్ట్రేషన్లు ఇప్పటికీ కోలుకోవడం లేదు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయని ఆశాఖ అధికారులు చెబుతున్నారు.

నిలిచిన నిర్మాణాలు..

అమ్మకాలు సరాసరిన నిలిచిపోవడంతో ఇప్పుడు భవన నిర్మాణాలు ఎక్కడిక్కడే నిలిచాయి. జిల్లా వ్యాప్తంగా పట్టణాలతో పాటు మిగతా నియోజవర్గం, మండల కేంద్రాల్లో భవన నిర్మాణాలు స్తంభించాయి. పెట్టుబడి లేక చతికిల బడ్డాయి. గ్రూప్ హౌస్‌లు, అపార్టుమెంట్‌లు సగంలోని నిలిచిపోయాయి. దీంతో రియల్ ఎస్టేట్‌ను నమ్ముకున్న అనేక మంది ఇప్పుడు దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయారు.

రైతులను దగా చేసింది వైసీపీ ప్రభుత్వమే..

- వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులను దగా చేసింది వైసీపీ ప్రభుత్వమేనని రాష్ట్ర వ్యవ సాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదేళ్లలో రైతులను ఇక్కట్లకు గురిచేసి ఇప్పుడు వారికోసం మొసలి కన్నీరు కారుస్తోందని ఆరోపించారు. రైతులకు అండగా' పేరుతో వైసీపీ శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమాలపై ఆయన స్పందించారు. వైసీపీ అధికారంలో ఉండగా కనీసం రైతులు పండించిన పంటకు బీమా కట్టలేని చేతకాని ప్రభుత్వంగా నిలిచిపోయిందన్నారు. ఐదేళ్ల పాలనలో భూసార పరీక్షలు నిర్వహించలేని అవగాహన లేని అసమర్థ పాలన చేశారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాల్జేయడం జగన్మోహన్ రెడ్డికే చెల్లిందన్నారు. నేడు రైతులకు అండగా ఉంటామంటూ వారిపై కపట ప్రేమను కురిపిస్తోందని విమర్శించారు. ఐదేళ్లలో రైతులకు నాణ్యమైన విత్తనాలను కూడా చేయలేక పోయారన్నారు. వ్యవసాయ రంగానికి పూర్తిగా నిర్వీర్యం చేసి రైతులకు ఉపయోగపడే యాంత్రీకరణ పరికరాలను అందించలేదని, ఐదేళ్లలో కనీసం నాణ్యమైన ఎరువులను కూడా సరఫరా చేయలేని అసమర్థుడు జగన్మోహన రెడ్డి అని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వంలో ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. దీంతో ప్రతీ రైతు కుటుంబంలో పండగ వాతావరణం కనిపిస్తోందన్నారు.

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

అరసవల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు వారోత్సవాలను జిల్లాలో డిసెంబరు 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్తు పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు, డ్వాక్రా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా వారికి ఇంధన పొదుపు, గృహోపకరణాల వినియోగంపై అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే ఇంజనీరింగ్ కళాశాలల్లో నూతన సాంకేతిక విజ్ఞానం అంశంపై వర్క్‌షాపులు నిర్వహిస్తామని, అన్ని విద్యుత్తు కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 20న బహుమతులు అందిస్తామన్నారు.

ఏకోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కవిటి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏకోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ మండల శాఖ సభ్యులు శుక్రవారం ఎంఈవో ధనుంజయ మజ్జికి వినతిపత్రాన్ని అందించారు. ఎంఆర్సీ వద్ద యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు మాట్లాడుతూ.. ఏకోపాధ్యాయులు జీతభత్యాలు, సర్వీసు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ఎంఈవోకు వినతిపత్రాన్ని అందించామని తెలిపారు. కార్యక్రమంలో కవిటి మండల అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, సీతంనాయుడు, మురళీప్రకాష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

ఇచ్ఛాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈదుపురం ఒడియా బాప్టిస్ట్ చర్చిలో బీమ్ బెహరా ఆధ్వర్యంలో ఒడియా పాస్టర్స్ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ బాబు 35మంది ఒడియా పాస్టర్లకు వస్త్రాలు బహూకరించి క్రిస్మస్ సంబరాలు ఉల్లాసంగా ప్రారంభించారు. పాస్టర్లు డి.ఏలియా, సుందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛావతి అమ్మవారి కోవెల వీధిలో కొలువై ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జామున ప్రభాత ఆరాధనలు పూర్తి చేసిన తర్వాత.. 108 స్వర్ణ పుష్పాలతో అర్చన జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. 108మంది మహిళలతో లలితా సహస్ర పారాయణం చేశారు.

ఆర్థిక సాయం అందజేత

పొందూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందిపడుతున్న పిల్లవలస గ్రామానికి చెందిన ఓ రజక కుటుంబాన్ని ఆ గ్రామస్థులు ఆర్థికంగా ఆదుకున్నారు. 20 ఏళ్లుగా గ్రామంలో కులవృత్తి చేసుకుని ఉంటున్న దాలినాయుడు.. ఇటీవల కిడ్నీవ్యాధి బారినపడ్డాడు. ఈ క్రమంలో అతడి కుమార్తెకు వివాహం నిశ్చయం అవ్వడంతో ఆర్థికంగా ఇబ్బంద్దిపడుతున్నాడు. దాలినాయడి పరస్థితి సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు దృష్టికి వెళ్లడంతో గ్రామస్థుల సాయంతో రూ.60 వేలు పోగుచేసి శుక్రవారం అందించారు. సర్పంచ్‌కు, గ్రామస్థులకు దాలినాయుడు కృతజ్ఞత తెలిపారు.

ఆదిత్యాలయంలో సహస్ర కలశ పూజ రేపు

అరసవల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయం శుద్ధిచేసే నిమిత్తం ఈ నెల 15న సహస్ర కలశాలతో స్నపన కార్యక్రమం జరుగుతుందని, ధను సంక్రమణం సందర్భంగా 16వ తేదీ తెల్లవారు జామున అభిషేకంతో ముగుస్తుందని ఆలయ ఈవో వై.భద్రాజీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక అజ్ఞాత భక్తుడు తన సొంత ఖర్చులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

వృథాగా కొళాయి నీరు

పొందూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పొందూరులో కొండవీధి సమీపంలో పంచాయతీ వీధి కొళాయి పైపులైన్లు పగలడంతో తాగునీరు భారీగా వృథాగా పోతోంది. పట్టణంలో రోడ్ల నిర్మాణం జరుగుతుండడంతో పైపులైన్ల నిర్వహణ సిబ్బంది అప్రమత్తంగా లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రోజంతా తాగునీరు వృథాగా పోయింది. తక్షణమే పైపులైన్లు మరమ్మతులు చేసి నీటివృథా అరికట్టాలని వీధివాసులు కోరుతున్నారు.


వృథాగా పోతున్న కొళాయి నీరు

ప్రహరీ లేని అంగన్‌వాడీ కేంద్రం

- ఇబ్బందిపడుతున్న చిన్నారులు
- పట్టించుకోని అధికారులు

గార, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కుమ్మరిపేటలో అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో సిబ్బంది, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. పదేళ్ల కిందట ఇక్కడ చెరువు గట్టుకు దగ్గరలో ఈ భవనం నిర్మించారు. నేటికి కూడా ప్రహరీ నిర్మాణం చేపట్టకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో విషకీటకాలు కేంద్రంలోకి చేరే ప్రమాదం ఉందని, అందువల్ల ఇక్కడ ప్రహరీ నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


కుమ్మరిపేట అంగన్‌వాడీ కేంద్రం

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

గుజరాతీపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియో గం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 19 బెంచీలు నిర్వహించామని, దీనిని కక్షిదారులంతా వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే లీగల్ సర్వీసులను ప్రజల వద్దకు చేరేలా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ వారిని, పారా లీగల్ వలంటీర్స్‌ను నియమించి వారికి బ్యాడ్జీలు ఇచ్చినట్టు తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్


అరసవల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఏ కాలనీలో గల ఆయన కార్యాలయంలో కల్లేపల్లి గ్రామస్థులు ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలు పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయని, కనీస మౌలిక వసతులకు కూడా నోచుకోక దయనీయ స్థితికి చేరుకున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో కార్యకర్తలకు సముచిత గౌరవం లభిస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పాలనకు మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూకళ్ల శ్రీను, మూకళ్ల జయానంద్, శీర రమణయ్య, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


కల్లేపల్లి గ్రామస్థులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఆమదాలవలస, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు మద్దతు ధరను అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం శ్రీనివాసాచార్యులపేట రైతు సేవా కేంద్రంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు సేకరణకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేపట్టి మద్దతు ధర దక్కేలా అందేలా చూడాలన్నారు. తమే శాతం పేరుతో రైతులను మిల్లర్లు ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశీలనలో పంచాయతీ సెక్రటరీ బగాది నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ అహ్మద్ ఖాన్

సకాలంలో ఉపాధి పనులు పూర్తి చేయాలి: అశోక్

కవిటి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కోరారు. రామయ్యపుట్టుగలో నియోజకవర్గస్థాయి ఉపాధిహామీ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పనులు చేపట్టడమే కాక సాగునీటి వనరులు మెరుగుపర్చేందుకు అవకాశాలు పరిశీలన చేయాలని సూచించారు. సాగునీటి కాలువలను మెరుగుపర్చితే పంటలకు నీరు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టవచ్చన్నారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణంలో పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. కూలీలకు ఎంతమేర వేతనాలు రోజువారీ అందుతున్నాయని, బకాయల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవిలో పనులు సక్రమంగా జరిగి కూలీలు వలసలు పోకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవోలు, ఏపీవోలు, టీసీలు పాల్గొన్నారు.


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అశోక్

రిమ్స్‌లో క్రిస్మస్ వేడుకలు అడ్డగింత

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో శుక్రవారం సూపరింటెండెంట్ షకీలా అనుమతులతో నిర్వహించిన ప్రీ క్రిస్మస్ వేడుకలు వివాదాస్పదంగా మారాయి. రిమ్స్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలు జరుగుతుండగా విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. రిమ్స్‌లో క్రిస్మస్ వేడుకలు ఏంటంటూ అక్కడి వారిని ప్రశ్నించి, బ్యానర్లు చింపేశారు. రిమ్స్ ఉద్యోగులకు వారికి మధ్య వాగ్వాదం చెలరేగడంతో రెండో పట్టణ పోలీసులకు రిమ్స్ అధికారులు సమాచారం అందించారు. దీంతో సీఐ పి.ఈశ్వరరావు అక్కడికి చేరుకుని వేడుకలు అడ్డుకున్న వారిని స్టేషన్‌కు తరలించారు.

23మద్యం సీసాలు సీజ్

ఇచ్ఛాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాలో కొనుగోలు చేసిన మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా డొంకూరు వద్ద పట్టుకొని మద్యం సీసాలు సీజ్ చేసినట్టు రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం డొంకూరు గ్రామం వద్ద తనిఖీలు చేపడుతుండగా 23 మద్యం సీసాలు తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన మహిళను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. పాఠశాల హెచ్ఎం నరేంద్రకుమార్ పట్నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

104 సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలి

పొందూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య రక్షణకు 24 గంటలు విధులు నిర్వహిస్తూ కష్టపడుతున్న తమకు వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి న్యాయం జరగలేదని, కూటమి ప్రభుత్వంలోనైనా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని 104 సిబ్బంది ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కూన రవి కుమార్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. నెలనెలా జీతాలు చెల్లించకపోవ డంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 104 సేవలను పీహెచ్‌సీల ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలని, డీఎస్సీ ద్వారా నియమితులైన డ్రైవర్లను కాంట్రాక్టులో పెట్టాలని వినతిపత్రం కోరారు. వినతిపత్రం అందించినవారిలో 104 సిబ్బంది ఐ.గోవిందరావు, పి.వాసుదేవరావు తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే రవికుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న 104 సిబ్బంది

ఏకగ్రీవంగా పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం


తీర్మాన పత్రాన్ని ఎంపీడీవోకి అందిస్తున్న కార్యదర్శులు

ఆమదాలవలస/ బూర్జ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బూర్జ ఎంపీడీవో కార్యాలయంలో మండల పంచాయతీ కార్యర్శుల కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా శుక్రవారం జరిగింది. అధ్యక్షుడిగా కరణం మురళీమోహన్‌రావు, గౌరవ సలహాదారుగా ఏ.అజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పి.చంద్రబాబు నాయుడు, ఎం.రోహిణి, ప్రధాన కార్యదర్శిగా జి.కల్యాణ్‌బాబు, కోశాధికారిగా బలివాడ కిరణ్‌కుమార్, జిల్లా బాధ్యులుగా ఎం.అమర్నాథ్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.రమేష్, ఆర్.హితేంద్రకుమార్, అప్పలరాజు, జాయింట్ సెక్రటరీలుగా కనక మహాలక్ష్మి, కె.రాంబాబు, రాజేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బూర్జ ఎంపీడీవోకు తీర్మాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికైనవారికి శుభాకాంక్షలు తెలిపారు.

రైతుల నోట్లో మట్టి కొట్టారు

శ్రీకాకుళం అర్బన్/ అరసవల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులను ఉద్ధరిస్తానంటూ ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం రైతుల నోట్లో మట్టి కొట్టిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. వైసీపీ అధిష్ఠానం పిలుపు మేరకు శుక్రవారం నగరంలోని 80 అడుగుల రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ఎడ్లబండిపై వైసీపీ నేతలు ర్యాలీగా వెళ్తూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు రైతులకు అన్యాయం చేయొద్దంటూ వినతిపత్రం అందజేశారు. మాజీమంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జడ్పీ ఛైర్మన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

జాతీయ సమైక్యత శిబిరానికి బీఆర్‌ఏయూ బృందం

ఎచ్చెర్ల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్‌లోని బర్ధమాన్ జిల్లాకు చెందిన రాణిగంజ్‌లో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న జాతీయ సమైక్యతా శిబిరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ బృందం పాల్గొంటోంది. వర్సిటీ తరఫున బి.యమున, ఎస్.కల్యాణ్, కె.ఝాన్సీ, పి.దేవిక, పి.రమేష్, ఎస్.షణ్ముఖ, ఎ.కౌశిక్, జె.లోలాక్షి ఈ శిబిరంలో పాల్గొంటున్నారు.



వర్సిటీ అధికారులతో ఎంపికైన వలంటీర్లు


శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

విద్యార్థులకు అభినందన

కవిటి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కళాఉత్సవ్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపిక కావడంతో వారిని అభినందించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను సత్కరించారు. కవిటి పాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు ఫోక్‌డాన్సు పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానాన్ని పొంది జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వీరితోపాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు పీటీకే శర్మ, ఏకాంబరేశ్వర శర్మ, గిరిబాబులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో ధనుంజయ మజ్జి, పాఠశాల ఛైర్మన్ టి.మోహనరావు, సర్పంచ్ పి.లక్ష్మణరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నగర సంకీర్తన


నగర సంకీర్తనలో భక్తులు

లావేరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇజ్జాడపాలెం గ్రామంలో శుక్రవారం స్వామి శ్రీనివాసానంద ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణకు అందరూ నడుము కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామంలోని పురువీధుల్లో నగరసంకీర్తన నిర్వహించారు.

జాబ్‌మేళాలో 23మంది ఎంపిక

సోంపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బారువ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాకు విశేషస్పందన లభించింది. 54మందికి ఇంటర్వ్యూలు నిర్వహించగా 23మందిని వివిధ కంపెనీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.రామారావు, వైస్‌ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ, బడ్డ రాంబాబు, తేజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

జి.సిగడాం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. భోజనం ముందు, భోజనం తరువాత కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది సత్యనారాయణ, వీవోఏ కల్యాణి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలి

రణస్థలం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఎన్టీఆర్ ట్రస్ట్ డాక్టర్ కె.సోమశేఖర్, రోటరీ క్లబ్ డాక్టర్ త్రిశాంక్ అన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి సౌజన్యంతో శుక్రవారం ఎపిటోరియా పరిశ్రమలో రక్తదానం శిబిరం నిర్వహించారు. 178 మంది రక్తదానం చేశారు. పరిశ్రమ ప్రతినిధులు కె.కమలాకర్‌రెడ్డి, పి.నారాయణరావు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

గ్రామ పంచాయతీ కార్యాలయం,నరసన్నపేట

రేఖా నెం.324/2024- బి **టెండరు నోటీసు** తే:13-12-2024ది

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం, నరసన్నపేట గ్రామ పంచాయితీ నందు దిగువ నుదహరించిన షెడ్యూలులో చూపబడిన సామగ్రి సప్లయి చేయుటకు టెండర్లు నిర్వహించబడును. టెండరు దాఖలు చేయువారు టెండరు దరావత్తు చెల్లించి తే:21-12-2024ది ఉదయం గం.11-00 నుండి మధ్యాహ్నం గం.1-00 వరకు గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద యీ దిగువ సంతకం దారునిచే గాని లేదా వారి అనుమతి పొందిన ఇతర ఉద్యోగిచే గాని సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించబడిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం గం.3-00లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరవబడును మరియు షెడ్యూల్ టెండరుదారులు టెండరు షరతులకు లోబడి పాల్గొనవలెను.

షెడ్యూల్ (టెండరు)

వ.నెం	సామాగ్రి వివరములు	సంవత్సరం	సప్లయి కాలపరిమితి	టెండరు ధరావత్తు
1)	ఖాకి యునిఫారములు(ప్యాంట్లు, షర్టు,చీరలు,జాకెట్లు,తువ్వాలు)	2024-2025సం.	15 దినములు	రూ.2000/-
2)	కొబ్బరి నూనె,బారుసబ్బులు	2024-2025సం.	15 దినములు	రూ.500/-
3)	పాద రక్షలు	2024-2025సం.	15 దినములు	రూ.500/-
4)	త్రాగునీరు ట్యాంకరు జింకు షీటుతో బాడీ కట్టుటకు	2024-2025సం.	15 దినములు	రూ.500/-
5)	PH ట్రాక్టర్ తొట్టె పూర్తిగా జింకు షీటుతో బాడీ కట్టుటకు	2024-2025సం.	15 దినములు	రూ.500/-
6)	PH ట్రాక్టర్ తొట్టె పాక్షిక రిపేర్లతో బాడీ కట్టుటకు	2024-2025సం.	15 దినములు	రూ.300/-
7)	HP Computer CPU-O2	2024-2025సం.	15 దినములు	రూ.300/-
8)	GP staff Biometric Attendance Device	2024-2025సం.	15 దినములు	రూ.200/-

టెండర్లు ఎట్టి కారణము చూపి గాని చూపకుండా గాని,వాయిద వేయుట గాని,తిరస్కరించుటగాని, పూర్తి అధికారం యీ గ్రామ పంచాయతీ, ఇందుకు సంబంధించిన అధికారులకై యుండును పూర్తి షరతులు, ఇతర వివరములు కార్యాలయ పని వేళలయందు అడిగి తెలుసుకోవలెను.

//సం.// పల్లి దాక్షాయణి
కార్యనిర్వహణాధికారి
(పంచాయతీ కార్యదర్శి)
గ్రామ పంచాయతీ, నరసన్నపేట

ప్రభుత్వ స్థలాల్లో దుకాణాల ఏర్పాటు

- పట్టించుకోని అధికారులు
- ఇది మేజర్ పంచాయతీలో తీరు


పెద్దపేట జంక్షన్ వద్ద బడ్డీ తొలగించి రేకుల షెడ్ వేస్తున్న దృశ్యం

నరసన్నపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మేజర్ పంచాయతీలో రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి దుకాణాలు వెలుస్తున్నాయి. కొందరు ముందుగా ఓ బడ్డీ ఏర్పాటు చేసిన కొన్ని రోజుల తరువాత దానిని తొలగించి రేకుల షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆ తరువాత పక్కా భవనాల నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పంచాయతీ అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జమ్ము జంక్షన్ నుంచి సత్యవరం జంక్షన్ వరకు బడ్డీ.. రేకుషెడ్ గాను.. ఆ తరువాత పక్కా నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. గత కొద్ది రోజులుగా పెద్దపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద మూడు షాపులు ఏర్పాటయ్యాయి. తాజాగా మరో షాపు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా పైడితల్లి ఆలయం వద్ద ప్రభుత్వ స్థలంలో పెద్ద పెద్ద నిర్మాణాలే చేపట్టగా విశ్రాంతి భవనం పేరుతో రేకుషెడ్ ఏర్పాటు చేశారు. జగన్నాథపురానికి వెళ్లే మార్గంలో బడ్డీలు.. ప్రస్తుతం పక్కా భవనాలుగా వెలిశాయి. ఇలా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురౌతున్నా పంచాయతీ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. అధికార పార్టీ నాయకుల అండతో ఈ తంతంగం జరుగుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఈవో ద్రాక్షాయణి వద్ద ప్రస్తావించగా నిర్మాణాలను నిలుపుదల చేస్తామన్నారు. గతంలో వేసిన షెడ్‌లను కూడా తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

క్రైం కార్నర్

కబేళాకు తరలిస్తున్న ఆవులు పట్టివేత

ఆమదాలవలస, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలోని పార్వతీశంపేట వద్ద అక్రమంగా కబేళాకు తరలిస్తున్న ఆవులను పట్టుకున్నట్టు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. శుక్రవారం కొత్తూరు మండలం బలద సంత నుంచి 34 ఆవులను అదే మండలానికి చెందిన నిచ్చెర్ల మల్లేష్, కుప్ప త్రినాథ్, షణ్ముఖరావు, కడుం గ్రామానికి చెందిన శంకర్ తోలుకొని వస్తుండగా పార్వతీశంపేట వద్ద పట్టు కున్నట్టు తెలిపారు. ఈ తర లింపులో సూత్రధారి, పాత్రధారి పట్టణంలోని ఏడో వార్డు చింతాడకు చెందిన గొంటి శేఖర్ ఉన్నట్టు తెలిపారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్టు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న 34 ఆవులను విజయనగరం జిల్లా గుర్లలోని గోశాలకు తరలిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ దాడుల్లో పశు సంవర్ధకశాఖ ఏడీ రేణంకి ఆనందరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

18.5 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

ఇచ్ఛాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 18.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వడి దుర్గా ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పురుషోత్తపురం ఎల్‌సీ గేటు వద్ద మొబైల్ పెట్రోలింగ్ బృందం, ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపడుతుండగా పట్టుబడినట్టు తెలిపారు. గంజాయితోపాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జీవి రమణ , ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పిలి దుర్గ గుడిలో చోరీ

ఎచ్చెర్ల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కుప్పిలి గ్రామంలోని దుర్గ గుడిలో గురువారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి పూజలకు శుక్రవారం వేకువజామున గుడి తలుపులు తెరిచేందుకు పురోహితుడు కసవ బైరాగి రాగా.. అప్పటికే తలుపులు తెరిచి ఉండడాన్ని గుర్తించాడు. గర్భగుడిలోకి వెళ్లి పరిశీలించగా అమ్మవారికి అలంకరించిన నగలు కన్పించకపోవడంతో చోరీ జరిగినట్టు గుర్తించి గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చారు. అమ్మవారికి అలంకరించిన 30 తులాల వెండి, ఒక తులం బంగారంతో పాటు హుండీని దుండగులు ఎత్తుకుపోయారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

పొందూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పెనుబర్తి రైల్వేగేటు సమీపంలో శుక్రవారం రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని ఓ వృద్ధురాలు మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మృతి చెందిన ఆమె వయసు 60 ఏళ్లు ఉండొచ్చని, ఎర్ర చీర ధరించి ఉన్నట్టు తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిం చారు. కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

8 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

సోంపేట/కంచిలి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తూ కంచిలి మండలం జాడుపుడికి చెందిన కల్యాణిని అరెస్టు చేసినట్టు సీఐ కె.బాబీ తెలిపారు. 8.4 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. అలాగే సోంపేట మండలం కొరంజాబందకు చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద ఉన్న మరో 90 లీటర్ల సారా పట్టుకొని సీజ్ చేశామన్నారు. ఈ రెండు కేసుల్లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మందస మండలం కొండలోగాంలో 700 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశామని తెలిపారు.

మద్యం బాటిళ్లతో ఇద్దరు..

కోటబొమ్మాళి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నిమ్మాడ కూడలి వద్ద వాన రామకృష్ణ, తంగుడు సురేష్ వద్ద చెరో ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎం.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం నిమ్మాడ జంక్షన్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారులు మాటువేసి వీరి వద్ద నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

కొత్తూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎండీ అమీర్‌ఆలీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కుంటిభద్ర, సిరుసువాడ గ్రామాల్లో విస్తృతంగా తనిఖీ చేపట్టారు. కుంటిభద్ర గ్రామంలో అగతముడి రాజారావు వద్ద 8 మద్యం సీసాలు పట్టుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బాహాడపల్లి గ్రామస్థులు

హరిపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బహాడపల్లి పంచాయతీలో సుమారు రూ.12 లక్షలు దుర్వినియోగమయ్యాయని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయం కార్యదర్శితో పాటు ఆర్డీవోకి వినతిపత్రాలు అందించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో నిధులు విడుదలయ్యాయని, అయితే ఎటువంటి పనులు చేపట్టకుండా వైసీపీ సర్పంచ్ కార్యదర్శి జాయింట్‌గా నిధులు డ్రా చేసుకున్నారని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సాలిన జానికిరావు, సాలిన మాధవరావు, ఎస్.గణపతి, కర్రి తాతారావు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థికి అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పలాసరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు ఉన్నత పాఠశాలకు చెందిన రాపాక సాహిల్ కుమార్ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-14 క్రికెట్ పోటీలో రెండోసారి పాల్గొని ప్రతిభ చాటిన నేపథ్యం లో శుక్రవారం ఉపాధ్యా యులు అభినందించారు. అలాగే పలాస మండల స్థాయి గ్రిగ్స్ కబడ్డీ పోటీలో బాలికలు ప్రతిభ కనబర్చడంతో హెచ్‌ఎం వీర్రాజు బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పీడీ రాంజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమద్ వ్రతం


ఆంజనేయస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

నరసన్నపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం హనుమత్ వ్రతాన్ని అర్చకులు వనమాలి శివశంకర్ వరప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, విష్వక్సేనారాధన, పంచగవ్యప్రాసన, మండల మండపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సామూహిక హను వ్రతాలు చేశారు. భక్తులు హనుమాన్‌చాలీసా పారాయణ, భజనలు చేపట్టారు. కార్యక్రమంలో దర్మకర్తలు మత్స శాంతి, నిరంజన్, రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న సంతోషిమాత

ఎల్.ఎన్.పేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సుపేట గ్రామంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ప్రమోద్ కుమార్ పత్రి, వినోద్ కుమార్ పత్రి, సత్యనారాయణ మహాపాత్రో శాస్త్రోక్తంగా వేదమంత్రాలతో పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ప్రతిఏటా మార్గశిర శుక్రవారాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు ఆనవాయితీ అని అర్చకులు తెలిపారు.

పీఆర్సీ కమిషన్‌ను తక్షణం వేయాలి


మాట్లాడుతున్న సంఘ నేతలు

కాశీబుగ్గ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీ కమిషన్‌ను తక్షణం వేయాలని ఏపీ నాన్ గజిటెడ్, గజిటెడ్ అధికారుల అసోసియేషన్ పలాస అధ్యక్షుడు బోనెల గోపాల్ కోరారు. శుక్రవారం సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జీపీఎఫ్ లోన్స్ ఏపీజీఎల్ఐ, డీఏ బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఓపీఎస్ అమలు చేయాలన్నారు. సంఘం ప్రతినిధులు రవికుమార్, రామారావు, ఉపేంద్ర, గిరి, దుర్గాప్రసాద్, పాపారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కోటబొమ్మాళి, డిసెంబరు 13: క్షేత్రస్థాయిలో 16 ఏళ్లుగా ప్రజలకు సేవలు అంది స్తున్న 104 ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో కె.ఫణీంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర పభుత్వం అరబిందో యాజమాన్యంతో చర్చించి 104 సిబ్బందికి రావాల్సిన బకాయిలను అందించేలా 14 రోజులు నిరసన కార్య క్రమాలు చేపడతామని, అప్పటికీ స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. 104 సిబ్బంది కోట రమణమూర్తి, బెండి బాలకృష్ణ పాల్గొన్నారు.

'భౌ'బోయ్!

- భయంగొల్పుతున్న కుక్కలు
- గుంపులుగా తిరగడంతో ఆందోళన


నందిగాం మార్కెట్ వీధిలో..

నందిగాం/వజ్రపుకొత్తూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పదుల సంఖ్యలో ఒకచోట చేరడంతో అటువైపు వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఒక్కోసారి వాహనాలపై వెళుతున్న సమయాల్లో కుక్కలు వాటిని వెంబ డిస్తుండడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు జరుగుతున్నాయి. చిన్నారులు, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. నందిగాం, వజ్రపుకొత్తూరు మండలాల్లో ఈ పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


వజ్రపుకొత్తూరు: గుల్లలపాడులో

నీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం

నందిగాం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నాలుగు మేజర్, తొమ్మిది మైనర్ నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీనికి గాను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందికి ఎన్నికల మెటీరియల్ అందజేయగా, తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు తహసీల్దార్ వి.సోమేశ్వరరావు ఎన్నికల విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. సామగ్రిని సంఘాల వారీగా సిబ్బందికి పంపిణీ చేయడంతో పలువురు సిబ్బంది బయట వేచి ఉండాల్సి వచ్చింది.

- నరసన్నపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలను సజావుగా నిర్వహించాలని తహసీల్దార్ ఆర్.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూధనరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్, నీటిపారుదలశాఖ అధికారి మురళీకృష్ణ, ఎలక్షన్ డీటీ శరత్ తదితరులు పాల్గొన్నారు.
- జలుమూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం నిర్వహిస్తున్న నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ జన్ని రామారావు తెలిపారు. మండలంలో 6 మేజరు, 6 మైనరు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన తెలిపారు.
- హిరమండలం,డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం నిర్వహించనున్న సాగునీటి సంఘం ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాటు పూర్తి చేశారు. సాగు నీటి సంఘాలకు తొమ్మిదేళ్ల తర్వాత ఎన్నికలు జరుగుతుండడంతో ఆయా టీసీ పరిధిలోని గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఎన్నికల అధికారులతో శుక్రవారం తహసీల్దార్ హనుమంతురావు సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.
- పాతపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 18 నీటి సంఘాలకు, 108 టీసీఎస్‌ల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని సబ్ డివిజన్ డీఈ ఈ కె.లీన తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంట వరకు ఎన్ని కల ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎన్నికల అధికారులు ఉదయం 7.30 గంటలకే కేంద్రాల్లో ఉంటారని ఆమె పేర్కొన్నారు.
- పోలాకి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొమ్మిది సాగునీటి సంఘాల పరిధిలో 108 టీసీలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయని తహసీ ల్దార్, ఎన్నికల అధికారి మంగిపూడి సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 17న డిస్ట్రిబ్యూటరీ సాగునీటిసంఘం ఎన్నిక నిర్వహిస్తారన్నారు. డిస్ట్రి బ్యూటరీ ఎన్నిక మబగాం పాఠశాలలో నిర్వహిస్తారన్నారు. ఎన్నికలు ఏకగ్రీవంగా, సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులకు సూచనలు చేశామన్నారు. ఎటువంటి వివాదాలకు తావివ్వవద్దన్నారు.

యూహెచ్‌సీల్లో వైద్యసేవలు మెరుగుపరచాలి


వైద్యాధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పలాస, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతిరోజూ వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటు లో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు సూచించారు. శుక్రవారం సంబంధిత వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో ఓపీ నిత్యం నమోదు చేయాలని, మందులను రోగులకు సకాలంలో అందించాలన్నారు. భవనాల నిర్మాణం పూర్తయిన కేంద్రాలను అప్పగించాలని, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను తీసుకొని సిద్ధంగా ఉండాలన్నారు. ఎమ్మెల్యే శిరీష దృష్టికి ఆరోగ్య కేంద్రాల సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

సమయపాలన పాటించాలి: ఎమ్మెల్యే ఎంజీఆర్


కూరగాయలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

కొత్తూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు అన్నారు. మండలంలోని వసప కేజీబీవీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ.. రెగ్యులర్, ఒప్పంద ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. విద్యార్థినులకు అందిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కూరగాయలు నాసిరకంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పుతో రైతుల్లో ఆందోళన


రహదారిపై నూర్పులు చేస్తున్న ప్రియాగ్రహారం రైతులు

పోలాకి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో శుక్రవారం మార్పులు సంభవించడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కోసిన పంటను నూర్పిడి చేయడం, ఎండబెట్టిన ధాన్యాన్ని భద్రపరచడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. గత నాలుగు రోజులుగా వాతావరణ కేంద్రం తుఫాన్ హెచ్చరికలతో ఆందోళన చెందామని రైతులు తెలిపారు. ధాన్యం ఇంటికి తీసుకువెళ్లేందుకు ఖరీఫ్ రైతులు అనేక కష్టాలు పడ్డారు.


ఆరబెట్టిన ధాన్యాన్ని పోగుపెడుతున్న రైతు

న్యూస్ బాక్స్

నేడు మండల సమావేశం

పలాసరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పలాస ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సాధారణ సమావేశం శనివారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎన్.వసంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

16 నుంచి సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

జలుమూరు, డిసెంబరు 13: పంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఈనెల 16 నుంచి 19 వరకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బ్యాచ్‌ల వారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.అప్పలనాయుడు తెలిపారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది శిక్షణ తరగతులకు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ మృతికి సంతాపం

నందిగాం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాపుతెంబూరు గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ తుంగాన చైతన్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నివాళి అర్పించారు. ఎంపీడీవో టి.రాజారావు ఆధ్వర్యంలో కార్యదర్శుల సంఘ ప్రతినిధులు కె.సంతోష్ కుమార్, రమణబాబు, సచివాలయ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక

కోటబొమ్మాళి, డిసెంబరు 13: మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నికలు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా డి.బాలకృష్ణ, గౌరవాధ్యక్షుడుగా చింతాడ సన్యాసిరావు, ఉపాధ్యక్షుడిగా బి.నరేష్, జనరల్ సెక్రటరీగా ఆర్.భాస్కరరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బగాది సతీష్, ఎస్.శైలజ, శ్రీదేవి, భాషాఖాన్, తిరుపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి యూనియన్లు పని చేయాలే తప్ప వృత్తి విషయంలో రాజీపడకూడదన్నారు. అందరికీ సమన్యాయం చేసేలా విధులు నిర్వ హించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన


పుస్తకాలను అందిస్తున్న పీవో

పాతపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ పీవో టి.విమలారాణి అన్నారు. పాతపట్నం-1,-2 అంగన్ వాడీ కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారుల బోధనా పుస్తకాలను పంపిణీ చేశారు. విమర్శలకు అవకాశమీయ వద్దన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనూరాధ, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాం-బాతుపురం బీటీ రోడ్డు నిర్మించండి

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజాం-బాతుపురం గ్రామాల మధ్య మిగిలి ఉన్న గ్రావెల్ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు. 20 గ్రామాల ప్రజల రాకపోకలకు అను వైన ఈ మార్గం గత టీడీపీ పాలనలో కొంతమేర బీటీ రోడ్డుగా మార్చారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలిన పనులపై నిర్లక్ష్యం వహించడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినందున అసంపూర్తి రోడ్డును బీటీగా మార్చి పనులు చేయాలని వారు కోరుతున్నారు.


రాజాం-బాతుపురం గ్రామాల మధ్య మిగిలిన గ్రావెల్ రోడ్డు